ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 18, ఏప్రిల్ 2026



## ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు
# నాణ్యమైన వైద్యం అందించాలి

*** నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులను ఇండెంట్ పెట్టి ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని, అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రోగులకు వివిధ విభాగాల సమాచారం తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవల మెరుగుదలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

**● సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్**

ఉట్నూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తుందని, ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలలో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరిగిందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 16 పాఠశాలలను విద్య ప్లస్ పాఠశాలలుగా మార్చి ఎంపికైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం, నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి తగు శిక్షణ అందించి పాఠశాలలకు కేటాయించడం, అధునాతన సైన్స్ ల్యాబ్ స్థాపించి కంప్యూటర్ ఆధారిత విద్యను చేరువ చేయడం, ఏ. ఐ. టూల్స్ ద్వారా విద్యార్థులు స్వయంగా అభ్యసించే విధంగా తీర్చిదిద్దరించే జరుగుతుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, గ్రంథాలయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూ రీడింగ్ పై ప్రత్యేక కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలలో అన్ని వసతులు కల్పించి సర్వతో ముఖాభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ అమలు చేయడం, ప్రత్యేక బోధన సామాగ్రి అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల పాఠశాలలలో ప్రతి డివిజన్ కు 2 పాఠశాలల చొప్పున ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి విద్యా సంవత్సరం నుండి విద్యా ప్లస్ ప్రత్యేక కార్యక్రమం అమలు ద్వారా ప్రతి గిరిజన విద్యార్థి రాబోయే 15 సంవత్సరాల కాలంతో మిగతా 2లో..

# వేసవి దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



లక్షెట్టిపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వేసవి దృష్ట్యా మిగతా 9లో..

# భక్తులకు సౌకర్యంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలి

*** జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 17, ప్రభాతవార్త



గోదావరి పుష్కరాలు2027 లో భాగంగా భక్తులకు సౌకర్యవంతంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో గల పుష్కర్ ఘాట్ వద్ద భక్తులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పనులను తహసీల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్ నాయకపు వినయ్ కుమార్, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పుష్కర్ ఘాట్‌కు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ సౌకర్యాలు విస్తరించాలని, మిగతా 2లో..

పెద్దకర్మ



స్వస్తిశ్రీ పరాభవనామ సం॥ర చైత్ర బ॥ అష్టమి
తేది: 10-04-2026 శుక్రవారం రోజున
శ్రీ భూక్యా గోదుబాయి గారు
పరమపదించారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది: 18-04-2026 శనివారం రోజున
పెద్దకర్మ
జరుపబడును. కావున తామెల్లరు విచ్చేసి
వారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.

కార్యస్థలం :
మా స్వగృహము,
గ్రా॥ మం॥ రెబ్బెన,
జి॥ కుమ్రంభీం ఆసిఫాబాద్.
సెల్: 7981641897

ఇట్లు :
కుటుంబ సభ్యులు
మరియు బంధు-మిత్రులు



# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

(మొదటిపేజీ తరువాయి)

పోటీపడే విధంగా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 130 పాఠశాలలలో ప్రవేశ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, విద్యార్థులకు మొదటిసారి ఓఎంఆర్ జవాబు అందించి పోటీ పరీక్షల విధానంపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ సి ఎం ఓ జగన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు సౌకర్యంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వాహనాల రాకపోకలు సులభంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఘాట్ పరిసర ప్రాంతాలలో శుభ్రత, తాగునీరు, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, దేవాలయ ప్రాంతాల్లో శుభ్రత, ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం అక్కేపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. నర్సరీ, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, ఇందిరమ్మ ఇండ్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, గోశాలలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో, సమయానికి పూర్తయ్యేలా పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో పిల్లలకు సరైన వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యలో అగ్రస్థానం..

### - కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాగజ్‌నగర్ విద్యార్థులు ఈ ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో విశిష్ట స్థానం సంపాదించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్. కల్యాణి తెలిపారు. ముఖ్యంగా వృత్తి విద్యా విభాగంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం. శృతి కళాశాల,జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించగా, మొదటి సంవత్సరం విద్యార్థిని సనఫ్ జరీన్ కూడా అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్. కల్యాణి ఈ ఇద్దరు విద్యార్థినులను సన్మానించి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ప్రతిభావంతులైన విద్యార్థినులు జిల్లాకు గర్వకారణమని, వారి విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. లెక్చరర్ సయ్యదా ఫిర్దౌస్ ఫాతిమా విద్యార్థినులకు అభినందనలు తెలియజేస్తూ, కృషి, పట్టుదల మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

### హెల్మెట్, సీటు బెల్టు లేకుంటే

# కలెక్టరేట్‌లోకి అనుమతి లేదు

### - సీఐ గోపతి రవీందర్ - కలెక్టర్ కార్యాలయం వద్ద అరైవ్.. అలైవ్.. అవగాహన

నస్పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కారులో వచ్చే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, ద్విచక్ర వాహనాలపై వచ్చే వారు హెల్మెట్ ధరించడాన్ని విధిగా పాటించాలని, లేకుంటే ఇకపై కలెక్టర్ కార్యాలయంలోకి వాహనదారులను అనుమతించబోమని మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్ స్పష్టం చేశారు. అరైవ్.. అలైవ్.. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నస్పూర్ లోని జిల్లా కలెక్టర్ కార్యాలయ కమాన్ వద్ద వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, సందర్శకులకు హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యతను వివరించారు. ప్రజల ప్రాణాలను రక్షించడమే పోలీసుల ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సహకారం ఉంటేనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించడం సాధ్యమవుతుందని గోపతి రవీందర్ చెప్పారు. ప్రతి వాహనదారుడు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవడానికి నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు కేవలం జరిమానాల కోసం కాదని, ప్రతి ఒక్కరి క్షేమం కోసమని గుర్తు చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు కలెక్టరేట్ లోపలికి ప్రవేశం ఉండదని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే వారు ఇతర ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. వాహనదారులందరూ పోలీసులకు సహకరించి రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చాలని కోరారు. నిబంధనల అమలులో ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీసీ నస్పూర్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ మేకల ప్రశాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




కలెక్టరేట్ కమాన్ వద్ద వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ గోపతి రవీందర్

# రోడ్డు ప్రమాదాల నివారణ నియమాలు పాటించాలి: ఇన్‌స్పెక్టర్ టి. సాయికుమార్

భైంసా, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా వారోత్సవాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్లు, ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భైంసా టౌన్ ఇన్‌స్పెక్టర్ టి. సాయికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ముఖ్యంగా గోల్డెన్ అవర్‌లో బాధితులను ఆదుకోవడం, డయల్ 100/112 ప్రాముఖ్యత, అత్యవసర సమయాల్లో సీపీఆర్, మరియు ప్రథమ చికిత్స అందించే విధానాలపై సిబ్బందికి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ మరియు ఫైర్ సిబ్బంది స్పందించే తీరుపై అవగాహన కల్పిస్తూ సీపీఆర్, ప్రథమ చికిత్సపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సీట్ బెల్ట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి జాగ్రత్తలు తెలపడమే కాకుండా, రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటిస్తామని సిబ్బందితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వర్గాలతో పాటు అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న టౌన్ ఇన్‌స్పెక్టర్ టి. సాయికుమార్

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరసన

### - పీఆర్‌సి, డీఏ బకాయిల విడుదల, సీపీఎస్ రద్దు కోరుతూ మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ డిస్ట్రిక్ట్ ఫోరం ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కుంటాల నారాయణ, కార్యదర్శి రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు తమ డిమాండ్లను వినిపించారు. ముఖ్యంగా పీఆర్‌సి అమలు, పెండింగ్ డీఏల విడుదల, హెల్త్ కార్డుల జారీ, పెండింగ్ బిల్లుల చెల్లింపు, సీపీఎస్ రద్దు వంటి అంశాలను తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యు. సుధాకర్, పి. సుజాత, సంయుక్త కార్యదర్శి ఫాతిమా బేగం, సంస్కృతిక కార్యదర్శి జె. మల్లయ్య, ప్రచార కార్యదర్శి ఎం. శంకర్, కార్యనిర్వహణ సభ్యులు నవీన్ రాజ్, ఎస్. జ్యోత్స్న, కార్యాలయ మేనేజర్ ప్రవీణ్, ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ రమాదేవి, సహాయ ఇంజనీర్ సి.హెచ్. నవీన్, ఎగువ శ్రేణి గుమస్తా శ్రావణ్ తదితరులతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

# సింగరేణిలో తొలిసారిగా క్రీడాకారులు, కళాకారుల మహా సమ్మేళనం

## - ఈ నెల 19న శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో భారీ వేడుక

**నస్పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

సింగరేణి చరిత్రలో మొదటిసారి కార్మిక క్రీడాకారులు, కళాకారులు, అధికారులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు గూడూరి యాదిరెడ్డి, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఈసంపెల్లి రాంచందర్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియం సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 19న ఆదివారం నిర్వహించనున్న ఉద్యోగ క్రీడాకారులు, కళాకారులు, అధికారుల మహా ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో విడుదల చేశారు. శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సమ్మేళనానికి సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి, సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమల్ రావు, డీసీపీ ఎగ్గడి భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. 1992లో ఏర్పాటైన ప్రగతి స్టేడియం ఎంతో మంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని నిర్వాహకులు గుర్తు చేశారు.



మహా ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు, క్రీడాకారులు


ఇక్కడి కార్మికులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలతో పాటు కోల్ ఇండియా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి గుర్తింపు తెచ్చారు. సింగరేణి యాజమాన్యం ప్రోత్సాహంతో వేలాది మంది కార్మికుల బిడ్డలు, నిరుద్యోగ యువత క్రీడల ద్వారా ఉద్యోగాలు సాధించారని వివరించారు. ఈ భారీ సమ్మేళనం ద్వారా పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు ప్రతిభావంతులను గౌరవించుకోవాలని నిర్ణయించారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు శ్రీరాంపూర్ కాలనీ ఎస్‌బిఐ గ్రౌండ్ నుంచి క్రీడాకారుల ర్యాలీ ప్రారంభమై ప్రగతి స్టేడియం వరకు కొనసాగుతుంది. అనంతరం ప్రారంభమయ్యే సమ్మేళనంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సన్మానం చేస్తారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు గోవర్ధన్ రెడ్డి, శ్యాంసుందర్, రాళ్లబండి రాజన్న, ఎద్దు సదయ్య, గద్దల భానయ్య, భానుప్రకాష్, బాబురావు, శేషగిరిరావు, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో ఎల్కంటి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**జైపూర్, ఏప్రిల్ 17, ప్రభాత వార్త**

మండల కేంద్రం లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ఎల్కంటి గ్రామం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడి సిహెచ్. చిరంజీవి ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని, తద్వారా ముందస్తుగా వ్యాధి నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పవన్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో సుమారు 40 మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారికి తగు విధంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు.



# కాల్వ తండాలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమం

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలం కాల్వ తండాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ రాజేశ్వరి మాట్లాడుతూ తీవ్రమైన ఎండల వల్ల డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయని, జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. వేసవిలో ప్రజలు ఎండలో పనులకు వెళ్లేటప్పుడు తలపై గుడ్డ లేదా టోపీ ధరించాలని, తరచూ నీరు తాగుతూ ఉండాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లడాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్వైజర్, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కమిటీలు ముఖ్యం: రామ్ కిషన్‌రెడ్డి

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ బూత్ స్థాయి ఏజెంట్ల నియామక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కమిటీల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో శక్తివంతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ చేరవేయడంలో ఏజెంట్లు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఏలేల చిన్నారెడ్డి, అశోక్ రాథోడ్, తోడిశెట్టి సదన్, జాన్ సత్య తదితరులు పాల్గొన్నారు.



# గ్రీన్ వుడ్ సీబీఎస్ఈ పాఠశాలలో ఫిన్లాండ్ విద్యా విధానం ప్రారంభం

**మంచిర్యాల,ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా లోని గద్దెరాగడి నందు గల గ్రీన్ వుడ్ పాఠశాలలో శుక్రవారం రోజు ఫిన్లాండ్ విద్యా విధానం ప్రారంభించారు.ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న విద్యావ్యవస్థ కనుగుణంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫిన్లాండ్ విద్యా విధానాన్ని మన గ్రీన్ వుడ్ పాఠశాలలో ప్రారంభించడానికి ఫిన్లాండ్ బృందం శుక్రవారం రోజు విచ్చేసి, తల్లిదండ్రులకు నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఫిన్నిష్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎఫ్‌జిఈఎస్ గ్రీన్వుడ్ హై స్కూల్ సంయుక్తంగా ఫిన్లాండ్ విద్యావిధానాన్ని 202627 సంవత్సరం నుంచి పాఠశాల లో ప్రారంభిస్తున్నామని చైర్మన్ నాయుడు తెలిపారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఎన్నో ఉద్యోగాలు పోతున్నాయని కానీ స్కిల్స్ ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది లేదని వారు తెలిపారు.స్కిల్ లాబొరేటరీస్ కూడా స్కూల్‌లో పెడుతున్నామని వారు తెలిపారు. కృత్యాధార బోధన ద్వారా పిల్లలకు మంచి విద్యను అందించటానికి ప్రణాళికలు రూపొందించామని,శ్రీమతి లారా, క్లాస్ రూమ్స్‌కి వెళ్ళి పిల్లలతో ముచ్చటించారు. తదనంతరం మాట్లాడుతూ పిల్లలకు స్వేచ్ఛ నివ్వాలని,ఆ స్వేచ్ఛ దుర్వినియోగం కానివ్వకుండా చూడాలని వారన్నారు. తల్లిదండ్రులు, స్కూల్, విద్యార్థుల సమిష్టి కృషి తో గొప్ప విజయాలు అందుకోవచ్చని తెలిపారు. విశాలమైన క్లాస్ రూములు, పెద్ద ప్లే గ్రౌండ్‌తో మంచి సౌకర్యాలు కల్పించారని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డా.లారా, డా. రాజేశ్వరి, డీన్ డా మాధురి సగాలే, అకడమిక్ అడ్వైసర్, డా. భరద్వాజ నాయుడు, చైర్మన్, ఏజీఎం పవన్,ప్రిన్సిపాల్ చంద్ర మోహన్,హెడ్ మిస్ట్రెస్ క్రిస్టినా,వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి,ఎ ఓ కుద్దుస్ పాల్గొన్నారు.





# దళిత రత్న బానయ్యకు ఘన సన్మానం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

దళిత రత్న అవార్డు గ్రహీత, తాపీ కార్మిక సంఘం బెల్లంపల్లి అధ్యక్షుడు దాసరి బానయ్యకు ఘన సన్మానం నిర్వహించారు. శుక్రవారం రోజున ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తాపీ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు శాలువాలు, పూలమాలలతో బానయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘం ముఖ్య సలహాదారు మహమ్మద్ అంకూస్, కోశాధికారి కత్తెర్ల లచ్చన్న తదితరులు మాట్లాడుతూ, దాసరి బానయ్య దళితుల సంక్షేమం కోసం, ముఖ్యంగా తాపీ కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆయనకు దళిత రత్న అవార్డు రావడం సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. సన్మానం స్వీకరించిన దాసరి బానయ్య మాట్లాడుతూ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకత్వం తనకు ఈ అవార్డు ప్రదానం చేయడం జీవితంలో మరపురాని ఘట్టమని తెలిపారు. ఈ అవార్డు అందజేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ అధ్యక్షుడు జన్ను అశోక్, తాపీ కార్మిక సంఘం నాయకులు మంతెన సత్తయ్య, ఇరుగురాల శివాజీ, ఇప్ప మల్లేష్, రాపెల్లి రాజేష్, దొబ్బల రాజయ్య, లింగంపల్లి బాపు, మేడి పెంటయ్య, గొడిసెల శ్రీనివాస్, కందుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ రాములును మర్యాదపూర్వకంగా కలిసిన బీఎస్పీ నాయకులు

**నస్పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ)గా నియమితులైన వడాల రాములును బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా నాయకులు శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించాలని కోరారు. జిల్లాలోని రెవిన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ పాలనను ప్రజలకు చేరువ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ కాదాసి రవీందర్, జిల్లా ఈసీ మెంబర్ సెట్టి ప్రవళిక, ఎండీ మాతిన్ ఖాన్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గోమాస బ్రహ్మానందం, మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, బామ్ సేఫ్ జిల్లా కన్వీనర్ సెట్టి శంకరయ్య, అడ్వకేట్ నటేశ్వర్ పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్‌లో ప్రాణాలను కాపాడవచ్చు

## - నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి - గోల్డెన్ అవర్, సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

**వేమనపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

ప్రాణాపాయ పరిస్థితుల్లో మొదటి గంట అయిన గోల్డెన్ అవర్, సీపీఆర్, రాహ్‌వీర్ ప్రాముఖ్యతపై నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వేమనపల్లి బస్ స్టాండ్ సమీపంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన సమయంలో స్పందిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తరువాత తొలి 60 నిమిషాలు అత్యంత కీలకమని ఈ సమయంలో గాయపడిన వ్యక్తికి తక్షణ వైద్య సహాయం అందితే ప్రాణాపాయం తగ్గించవచ్చని చెప్పారు. రక్తస్రావం ఆపడం, శ్వాస సక్రమంగా ఉండేలా చూడటం వంటి ప్రాథమిక చర్యల ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు తక్షణ సహాయం చేసి ప్రాణాలను కాపాడిన వ్యక్తులను ప్రభుత్వం రాహ్‌వీర్ లుగా గుర్తించి రూ. 25వేలు నగదు బహుమతితో సత్కరిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించి, అత్యవసర పరిస్థితుల్లో ముందుకు రావడానికి ప్రోత్సహించబడుతుందని అన్నారు. 108 సిబ్బంది పాల్గొని సీపీఆర్ చేసే విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గుండె ఆగినప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ఛాతిపై సరైన స్థానంలో, సరైన ఒత్తిడితో కంప్రెషన్‌లు ఇవ్వాలి నిమిషానికి 100–120 కంప్రెషన్‌ల వేగంతో చేయాలి. శిక్షణ పొందిన వారు మాట్లాడుతూ మాత్రమే మోత్‌టుమోత్ పద్ధతిని అనుసరించాలి. వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ పి. జనార్దన్ రెడ్డి, పైలట్ లు ఇమామ్ షరీఫ్, సంపత్‌లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది



## ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పోరాటానికి విస్తృత మద్దతు

### 11వ రోజు నిరసన - సమస్య పరిష్కారం కోరుతూ కార్మికుల హెచ్చరిక

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల న్యాయ పోరాటానికి రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంఘీభావం ప్రకటిస్తున్నాయి. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పోరాటం 11వ రోజుకు చేరుకుంది. శాంతిఖని లాంగ్వార్ ప్రాజెక్టు వద్ద ప్లకార్డులతో నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కార్మిక వర్గం, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపడం యాజమాన్య మొండివైఖరికి ప్రతిస్పందనగా నిలుస్తోందన్నారు. గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న సుమారు 220 కుటుంబాలను ఒక్కసారిగా ఉపాధి నుంచి దూరం చేయడం అన్యాయమని విమర్శించారు. సంస్థ అవసరాలకు కార్మికులను వినియోగించుకుని, తర్వాత వీధుల్లోకి నెట్టివేయడం సమాజంలో చర్చనీయాంశంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు సానుకూలంగా స్పందించి కార్మికులను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే సోమవారం నుంచి పోరాటాన్ని మరింత తీవ్రరూపంలో కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

## రైతులు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: ఏఓ వికార్ అహ్మద్

**సారంగాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

రైతులందరూ ఈ నెల 20వ తేదీలోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వికార్ అహ్మద్ సూచించారు. రైతులు తమ సమీప ఏఈఓను కలిసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ మొబైల్ ఫోన్, పట్టాదారు పాస్ పుస్తకాన్ని వెంట తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు. ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. ఈ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల పండించిన పంటను అమ్ముకోవడానికి, ఎరువుల బుకింగ్‌కు వీలుంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు గడువులోగా తమ మొబైల్ నంబర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

## ఘనంగా కొనసాగుతున్న ఎల్లమ్మ జాతర

**సారంగాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని దేవుని గుట్టపై వెలిసిన ఎల్లమ్మ తల్లి బోనాల జాతరను అడెల్లి, సారంగాపూర్ గౌడ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని గౌడ సంఘ సభ్యులు తెలిపారు. జాతర మొదటి రోజును పురస్కరించుకొని గౌడ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన లంద ఎల్లమ్మకు బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు మంగళహారతులు, డోలు వాయిద్యాల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేపట్టారు. ఈ ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు భోగి తిరగడం, మూడో రోజు అమ్మవారిని వివిధ గ్రామాల్లో ఊరేగించడం, నాలుగో రోజు అడెల్లి పోచమ్మ వద్ద బోనాలు సమర్పించడం, ఐదో రోజు ఎల్లమ్మ చెంత బోనాలు వేస్తామని నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి: టీజీఈ జేఏసీ డిమాండ్

**కోటపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్త టీజీఈ జెఏసి పిలుపు మేరకు కోటపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ మరియు పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సహాధ్యక్షులు బిల్లా తిరుపతయ్య మాట్లాడుతూ.. 2023 జూన్ నుండి అమలు కావాల్సిన పీఆర్సీ నివేదికను ప్రభుత్వం తక్షణమే తెప్పించుకోవాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో ఘనంగా హిందూ సమ్మేళనం కార్యక్రమం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో హిందూ ధర్మం, సంస్కృుతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సమాజంలో ఐక్యత, సత్సంస్కారాలు పెంపొందించాలనే ఉద్దేశంతో హిందూ సమ్మేళన కార్యక్రమంను శనివారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని పద్మశాలి భవనంలో ఘనంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మిక గురువులు, శృంగేరి శారద ఆస్థాన పౌరాణికులు, ప్రముఖ ప్రవచనకర్త బాచంపల్లి సంతోష్ శాస్త్రి విచ్చేసి హిందూ ధర్మ పరిరక్షణ, భారతీయ సంస్కృుతి గొప్పతనం, ప్రస్తుత సమాజంలో యువత పాత్ర, కుటుంబ విలువలు మరియు ఐక్యత అవసరంపై ప్రత్యేక సందేశాన్ని అందించనున్నారు. ఆయన ప్రవచనం ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చైతన్యం కలిగించేలా ఉండనుంది. అలాగే కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని హిందూ సమాజ అభివృద్ధి, ఐక్యత కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో సహా భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి, హిందూ ఐక్యతను బలంగా చాటాలని, ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని హిందూ సమ్మేళన సమితి బెల్లంపల్లి అధ్యక్షులు కంభంపాటి శ్రీనివాస్ తెలియజేశారు.

## కాల్వ తండా, మాయాపూర్ పంచాయతీలను ఎంపీఓ గోవర్ధన్ తనిఖీ

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ తండా, మాయాపూర్ గ్రామ పంచాయతీలను శుక్రవారం ఎంపీఓ గోవర్ధన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. పంచాయతీ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించి, నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆయన, పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకొని, పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నర్సరీలు, వ్యర్థాల వర్గీకరణ షెడ్లను సందర్శించి నిర్వహణపై తగిన సూచనలు చేశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలో జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**నేరడిగొండ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



వినతిపత్రం అందజేస్తున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

బోథ్ నియోజకవర్గంలో మొక్కజొన్న, తెల్ల జొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఎండీ వి. శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి చొరవ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ సహకారంతో ఈ అంశాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ నేతృత్వంలోని నాయకులు మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారిని కలిసి రైతుల సమస్యలను వివరించారు. అనంతరం మార్క్‌ఫెడ్ ఎండీని కలిసి బోథ్, ఇచ్చోడ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభమవుతాయని నాయకులు వెల్లడించారు. రైతుల ప్రభుత్వం అయిన కాంగ్రెస్ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు నరసింహా దాస్, యువ నాయకుడు అలపాటి అచ్యుతానంద రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**- టీజీఈజేఏసీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన**

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్షెట్టిపేట అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జెఏసి (టీజీఈజేఏసీ) చైర్మన్ డాక్టర్ సురేందర్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ పరమైన అన్ని ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ నిర్ణయించిన కార్యాచరణలో భాగంగా భోజన విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. యు జి సి పే స్కేల్ ఉద్యోగులకు పి ఆర్.సి. బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా సిబ్బంది ఐక్యంగా పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా మహాత్మా సంతోష్, అధ్యాపకులు జాడి శంకరయ్య, డా.సంతోష్ కుమార్, డా.తన్నీరు సురేష్, డా.తిరుపతి, ప్రేమలత నాగేశ్వర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సంధ్యారాణి, కవిత, సత్యనారాయణ, నివేదిత బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కళాశాల సిబ్బంది



## రెబ్బెనలో అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం

**- సీపీఆర్ ప్రదర్శనతో ప్రాణరక్షణపై అవగాహన**

**- గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత వివరించిన ఏఎస్పీ చిత్తరంజన్**

**రెబ్బెన, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో శుక్రవారం రోజున అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ రెబ్బెన వైద్య సిబ్బంది, 108 అంబులెన్స్ సిబ్బందితో కలిసి సీపీఆర్ విధానాన్ని ప్రదర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో తొలి గంట అయిన గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరించి, ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న రాహ్ వీర్ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రెబ్బెన వెంకట కృష్ణ, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన

**తాండూర్, ఏప్రిల్ 17, ప్రభాతవాహత:**

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం వెంటనే 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీఆర్టీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. తమ పెండింగ్ సమస్యలు, ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**సిర్పూర్ టి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ టిజిఈ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం రోజున  మండల కేంద్రం లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎం ఆర్ సి భవన్ నుండి ఉపాధ్యాయులు తాసిల్దార్ రహీముద్దీన్ కు  వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీఈ జేఏసీ నాయకులు మాట్లాడుతూ పిఆర్సి కమిషన్ రిపోర్ట్ తీసుకొనిజూన్  2 లోపు పెండింగ్ బిల్లులు ఉపాధ్యాయుల ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని అన్నారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి  పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఈ జేఏసీ నాయకులు  సుభాష్ మేడి లక్ష్మీనారాయణ వెంకటరమణ  చిన్న అంకు సబీనా పురుషోత్తం రవికుమార్ రమణ డి హరీష్ కే హరీష్ శ్రీకాంత్ విద్యాచరణ్ ఉపేందర్ కరుణాకర్ సాయి తరుణ్ వంశీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

## రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చు

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్ నాయక్, ఆర్టీసీ ఆర్ఎం విజయ్ భాను పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరిత ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా"అరైవ్ అలైవ్" కార్యక్రమంను పలు శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో రోడ్డు భద్రతా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ముఖ్యమైన సూచనలు చేస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ ఉపయోగించడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదని, వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు రోడ్డు భద్రతపై మరింత జాగ్రత్తగా ఉండాలని సంకల్పం వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని హాజరైన వారితో ప్రతిజ్ఞ చెయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, పోలీస్ శాఖ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు సిబ్బంది పాల్గొన్నారు.

## జొన్న, మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గంలో జొన్నలు, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రైతుల సమస్యలను వివరిస్తూ వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధన్నూర్, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, తాంసి, భీంపూర్, బజార్‌హత్నూర్ మండలాల్లో తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు వెసులుబాటు కల్పించాలని కోరారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించారని, సోమవారం నుంచే నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే కూడా పాల్గొన్నారు

## బీసీ మహిళల ప్రాతినిధ్యం లేని బిల్లు మాకొద్దు: సుంకేట పోశెట్టి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే బీసీ మహిళలకు ఉప కోటా లేని బిల్లు తమకు వద్దని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లుపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే వెంటనే బీసీ కుల గణన చేపట్టి ఆ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలపై కేంద్రం చిన్నచూపు చూడటం సరికాదన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్రం ఎందుకు వెనుకంజ వేస్తోందని ఆయన ప్రశ్నించారు. కుల గణన చేపట్టి జనాభా ప్రకారం చట్టసభల్లో బీసీలకు 60 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ సామాజిక న్యాయం చేయాలని కోరారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేకంగా ఉప కోటా కేటాయించాలని, లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వంపై బీసీ సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. డీలిమిటేషన్ విషయంలో దక్షిణ భారత్‌కు అన్యాయం జరగకుండా అఖిలపక్షాలతో చర్చలు జరపాలని సుంకేట పోశెట్టి డిమాండ్ చేశారు.

## మాణిక్‌గూడ కరకట్ట నిర్మాణానికి రూ.48 లక్షల నిధులు మంజూరు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మాణిక్‌గూడ కరకట్ట నిర్మాణానికి రూ.48 లక్షల నిధులు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం మాణిక్ గూడ కరకట్ట నిర్మాణానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పునరావాస ప్రాంతంలో సీసీ రోడ్డు, అంగన్వాడి కేంద్రం, పాఠశాల వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు కుడి కాలువ గ్రామ సమీపం నుంచి వెళ్లడంతో వర్షాకాలంలో ఆ గ్రామానికి వెళ్లే రహదారి కోతకు గురయ్యేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యను జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆ గ్రామానికి వరద ముప్పు లేకుండా రక్షణ కరకట్ట నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన్నట్లు వెల్లడించారు. గ్రామానికి ఎన్నాళ్లుగానో ఉన్న ప్రధాన సమస్య పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందనతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత


నార్నూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఈటీ జేఏసీ నాయకులు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**నార్నూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈటీ జేఏసీ) ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జూన్ 2వ తేదీలోపు పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలతో పాటు 61 ఏళ్లు పూర్తి చేసుకున్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, 2004 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత విధుల్లో చేరిన వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఈటీ జేఏసీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు రాథోడ్, మారుతి, గౌరవ అధ్యక్షుడు గణేష్, సభ్యులు రవీందర్, ప్రమోద్, దిలీప్, జ్ఞానేశ్వర్, పురుషోత్తం, వీరేందర్, వినోద్, విజయ్ పాల్గొన్నారు.



## స్థలం కేటాయిస్తే బస్టాండ్ నిర్మాణం చేస్తాం
### - ఆర్ ఎం విజయ భాను

**బెజ్జూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాను శుక్రవారం ఆర్ఎం విజయభాను పరిశీలించారు. కాగజ్ నగర్, కౌటాల, పెంచికలపేట, బెజ్జూర్ మండలాలలోని మారుమూల గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసిఫాబాద్ డిపో ఆర్టీసీ బస్సులలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. పెంచికల్పేట్ నుండి సలుగుపల్లి వరకు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు సైతం చెడిపోతున్నాయని, ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కోసం సర్పంచ్ పాలకవర్గం స్థలం కేటాయించి తీర్మానం చేసి ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపో మేనేజర్ రాజశేఖర్ కు సమాచారం అందిస్తే వచ్చి స్థలాన్ని పరిశీలించి బస్టాండ్ నిర్మాణం కోసం నివేదిక పంపిస్తామని అన్నారు. వారి వెంట ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

## నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగుల నిరసన

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాసిల్దార్ తిరుపతికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు యాదగిరి, సాయి కుమార్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ నివేదికను అమలు చేయడం, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఆరోగ్య కార్డులో మంజూరు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ వంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. 2004 సెప్టెంబర్ 1కి ముందు నియామకాలు పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, మిగిలిన పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేష్, రాజ్ కమలాకర్ రెడ్డి, గంగాభవాని, వెంకటేష్, మల్లన్న, సుజాత, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ మహుల్కర్‌ను గౌరవ డాక్టరేట్ అవార్డు

**వాంకిడి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**

కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్‌ను ఇంటర్నేషనల్ రీసెర్చ్ లూసియానా అమెరికన్ యునివర్సిటీ పూణే డాక్టరేట్ అవార్డ్‌కు ఎంపిక చేసింది. ఈ నెల 19న ఆదివారం యునివర్సిటీ లో ఈ అవార్డును అందుకొనున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుండి సోషియాలజీ లో ఎంఏ, పూర్తి చేసిఉస్మానియా యూనివర్సిటీ నుండి దళిత, గిరిజన జీవన విధానంలో అధ్యయనంతో ఎం. ఫీల్, పూర్తి చేసిన అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలకు ఆకర్షితులైన ఆయన సేవలను గుర్తించిన మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఇంటర్నేషనల్ రిసెర్చ్ లూసియానా అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. ఈ నెల 19న ఈ అవార్డ్ ప్రధానం చేయనున్నారు. ముఖ్యంగా అంబెద్కరిజం, బుద్ధిజం ,సామాజిక సేవ కార్యక్రమాలను ప్రామాణికంగా తీసుకొన్నట్లు యునివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ అన్ని కృష్ణ, గైడ్ రమేష్ బోగ్నేనోకర్ లు తెలపినట్లు అవార్డ్ గ్రహీత అశోక్ మహుల్కర్ తెలిపారు.

### సామాజిక సేవా ప్రస్థానం

అశోక్ రాజు మహుల్కర్ 1995 1997లో ఉస్మానియ యూనివర్సిటీ నుండి సోషియాలజీ లోఎం ఫీల్ పూర్తి చేసిన సామాజిక సేవ కార్యక్రమాలకు ఆకర్షితుడై స్వచ్ఛంద సంస్థల ద్వారా అనేక సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తాను స్థాపించిన క్రీడ్ సెంటర్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్వరాన్మెంట్ డెవప్మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా 1997 నుండి 2002 వరకు మారుమూల గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు సేవలు అందించడం జరిగింది. అదేవిధంగా 1996 నుండి 2002 వరకు ఐఫార్డ్ పథకంలో ఐ టీ డీ ఏ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ లో పనిచేసిన 7 ఏళ్లు గిరిజనులతో సహవాసం చేసి వారి అభివృద్ధికి పాటుపడగా, 6 సంవత్సరాలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ కమిటీ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులుగా, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అషయాల, ఆయన చూపిన మార్గాలను మారుమూల గ్రామాల ప్రజలకు చెప్పి వారిని చైతన్య పర్చడం జరిగింది. అదేవిధంగా భారతీయ బౌద్ధ మహాసభ కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులుగా జిల్లాలో అన్ని గ్రామాల, పట్టణాలు



తిరిగి తతాగత్ భవాన్ బుద్ధుడి బోధనను ప్రజల్లో తీసుకొని పోవడానికి పనిచేస్తూ అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింగి. 2008లో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో తెలంగాణ స్వాతంత్ర పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తో కలిసి వాంకిడి మండల కేంద్రంలో లక్ష్మణ సేవసదన్ వెల్ఫర్ సొసైటీ స్వచ్ఛంధ సంస్థ ఏర్పాటుచేసి నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలు, మెడికల్ క్యాంపులు, యువకులకు అటల పోటీలు నేటికీ నిర్వహించడం జరుగుతుంది.. నిరుపేద పిల్లల చదువు కోసం కూడా కృషి చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వాంకిడి మండల కేంద్రంలో లైన్ క్లబ్ ఏర్పాటు చేసి తద్వారా మండలంలో ప్రజా సేవ కార్యక్రమాలు చేయడం జరిగింది. గత సంత్సరంలో మార్చి 15.నుండి మార్చ్ 23 వరకు భూటాన్ దేశంలో జరిపిన బుద్ధ దమ్మ యాత్రలో పాల్గొని బెస్ట్ ప్రమోటర్ అవార్డ్ సహితం అందుకోవడం జరిగింది. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకునీ పరిశీలించిన పీ ఎహ్ డీ, గైడ్ రమేష్ బోగ్నెనేకర్ డాక్టరేట్ డిగ్రీ లూసియానా అమెరికన్ యూనివ్సిటీ కు సిఫారసు చేయగా యునివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ ప్రదనానికి ఎంపిక చేసినట్లు అశోక్ మహుల్కర్ తెలిపారు.


ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ

## సిరికొండ మండలంలో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు: అడిషనల్ డీఆర్‌డీఓ తనిఖీ

**సిరికొండ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని శుక్రవారం అడిషనల్ డీఆర్‌డీఓ పర్యటించి పరిశీలించారు. పొన్న గ్రామ పంచాయతీలో జరుగుతున్న మట్టి కట్టల పనులను, అలాగే సోన్ పల్లిలోని పని ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. పనుల నాణ్యతను తనిఖీ చేసి, పనుల నిర్వహణపై అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం మల్లాపూర్ గ్రామ పంచాయతీలో కూలీల సమీకరణ, పనుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ, ఈసీ, పంచాయతీ కార్యదర్శి కూలీలకు పథకంపై అవగాహన కల్పించారు. మండలంలో ఉపాధి పనులు సజావుగా సాగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ పర్యటనలో అడిషనల్ డీఆర్‌డీఓ వెంట టీఏ, ఎఫ్ఏ, స్థానిక సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసిన ఎస్సై పూజ

**సిరికొండ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో వినియోగదారుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఒక రేషన్ డీలర్‌పై సిరికొండ ఎస్సై పూజ కేసు నమోదు చేశారు. నిత్యావసర సరుకుల కోసం వచ్చే ప్రజలతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, వారిని వేధించడానికి ప్రయత్నించినట్లు వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ ఆమె ఈ చర్య తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై పూజ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని, ఎవరైనా సరే ఇతరులను వేధించినా లేదా ఇబ్బందులకు గురిచేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. భవిష్యత్తులో కూడా ప్రజలను వేధించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ ఇంటి ముందు బైఠాయించిన యువతి

**జైపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడంటూ ఆరోపిస్తూ ఓ యువతి పసి బిడ్డ తో కానిస్టేబుల్ ఇంటి ముందు బైఠాయించిన సంఘటన శుక్రవారం జైపూర్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని ముదిగుంట గ్రామానికి చెందిన బాధితురాలు అదే గ్రామానికి చెందిన సోతుకు సాయి రాజ్ గుడిపేట బెటాలియన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యువతిని ప్రేమిస్తున్నానంటూ సన్నిహితంగా ఉన్నాడని, పెళ్లి గురించి మాట్లాడిన ప్రతిసారీ దాటవేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చిన విషయం తెలియజేయగా గర్భం ఉంచుకోమని తనను పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చాడని తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం సదరు యువతి బిడ్డకు జన్మించినట్లు తెలియజేసింది. కానిస్టేబుల్ సాయి రాజ్ మోసం చేశాడని, వివాహం జరిపించి తనకు న్యాయం చేయాలని యువతి ప్రభుత్వాన్ని కోరింది.

## గోల్డెన్ అవర్, సీపీఆర్‌లపై అవగాహన కల్పించిన పోలీసులు

**జైపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**



ప్రాణాపాయంలో ఉన్న వారికి తక్షణ ప్రాణ రక్షణ చర్యలు అందించాలనే లక్ష్యంతో జైపూర్ పోలీసులు గోల్డెన్ అవర్ ,సీపీఆర్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జైపూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంట ఎంతో కీలకమని, ఆ సమయంలో బాధితులను ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చని, ఆలస్యంగా ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. ప్రమాద స్థలంలో ఉన్న వారు భయపడకుండా ముందుకు వచ్చి సహాయం అందించాలని సూచించారు. అదేవిధంగా గుండె పోటు గురైన వ్యక్తులకు సీపీఆర్ ఎలా చేయాలో వైద్యాధికారులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ప్రమాద స్థలంలో గాయపడిన వ్యక్తిని అవసరం లేకుండా కదలించకూడదని అలాగే వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సంప్రదించాలని సూచించారు.

### ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం

# ఛలో సబ్ కలెక్టర్ కార్యాలయం

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**

ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం నెల 21 ఏప్రిల్ న కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చలో సబ్ కలెక్టర్ కార్యాలయం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాగజ్ నగర్ మండలంలోని బట్టుపల్లి, ఎన్‌జీఓ కాలనీ గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు దరిగం ఫారెస్ట్‌లో పని ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలపై తీవ్ర ప్రభావం చూపుతున్న రెండు ఫోటోలు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం వల్ల అనేక మంది కూలీలకు పని దొరకకపోవడం జరుగుతోందని అన్నారు.వికసిత భారత్ జి రామ్ జి పేరుతో ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం 44-45 డిగ్రీల తీవ్ర ఎండల్లో పని చేస్తున్న కూలీలకు కనీస సదుపాయాలు అయిన మంచినీరు, టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే పనులు జరుగుతున్నప్పటికీ, ఏ అధికారి కూడా పనిస్థలాలను సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకోవడం లేదని అన్నారు.పనులు చేసిన కూలీలకు కూలి డబ్బులు సమయానికి అందకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. గ్రామాల నుండి 34 కిలోమీటర్ల దూరంలో ఉన్న పనిస్థలాలకు వెళ్లడానికి రోజుకు ఒక్కొక్కరికి సుమారు రూ.50 వరకు ఖర్చవుతుందని, ఆ ప్రయాణ ఖర్చులను ప్రభుత్వం భరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.అలాగే పనిస్థలాల్లో మెడికల్ కిట్ వంటి అత్యవసర సదుపాయాలు కూడా అందుబాటులో లేవని, పనిముట్లు అయిన సభలు, పారా, గంప, కొడవలి, గొడ్డలి వంటి సామగ్రిని ప్రభుత్వం అందించాల్సిన బాధ్యత ఉందని అన్నారు.ఉపాధి హామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్



## బెల్లంపల్లి మున్సిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్‌పై ఆకస్మిక దాడులు

**- దుకాణ యజమానులపై రూ.16,000 జరిమానా**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్లాస్టిక్ విక్రయ దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా 120 మైక్రాన్లకు లోపు ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు. తనిఖీలలో భాగంగా సుమారు 40 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణ యజమానులపై మొత్తం రూ.16,000 జరిమానా విధించారు. ఇకపై నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారాలు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు, వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణానికి మేలు చేసే ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని మున్సిపల్ అధికారులు సూచించారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న నిషేధాన్ని కచ్చితంగా పాటించాలని కోరారు. ఈ దాడుల్లో మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి పర్యవేక్షణలో శానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, ఈఈ సంతోష్, వార్డు ఆఫీసర్ పురుషోత్తం, మున్సిపల్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం పట్టివేత

**బెజ్జూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని మర్తిడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని శుక్రవారం బెజ్జూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మర్థిడి గ్రామ పరిసర ప్రాంతాల్లో పహారా విధులు నిర్వహిస్తున్న సమయంలో, ఒక వ్యక్తి తన నివాసంలో అక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ ఉంచుకున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి తనిఖీలు చేసినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో సుమారు 15 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని,ఈ బియ్యం విలువ సుమారు రూ.18,000/ ఉంటుందని అన్నారు.నిందితుడు ఈగ పుల్లయ్య మర్తిడి గ్రామం,పరిసర ప్రాంతాల ప్రజల వద్ద నుంచి కిలోకు రూ.12/ చొప్పున కొని,వాటిని మహారాష్ట్రకు అక్రమంగా తరలించి అమ్మడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

**దండేపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం చేయడం జరిగింది.షెడ్యూల్ ప్రకారం పిల్లలకి కథలు చేయడం ద్వారా పిల్లలు భాషాభివృద్ధి మెరుగుపడుతుందని తల్లిదండ్రులకు వివరించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి తల్లులకు గర్భిణీ బాలింతలకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.శుక్రవారం రోజున 99 రోజుల ప్రణాళికలో భాగంగా బరువు తక్కువ ఉన్న పిల్లలన బరువు చూసి స్పెషల్ డ్రైవ్‌లో నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మి ఏరియా పరిధిలోని గర్భిణీలు బాలింతలు గ్రామ పెద్దలు అంగన్వాడి టీచర్ సుజాత ఆయా పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్య - గ్రామస్తుల ధర్నా

**చింతలమానేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**

మండలంలోని కర్జెల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. వాగ్మరి వాడ, బూర్దగుడ కాలనీలలో గురువారం సాయంత్రం నుంచి కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య గత కొన్ని రోజులుగా కొనసాగుతున్నప్పటికీ పరిష్కారం లేకపోవడంతో గ్రామస్తుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. కరెంట్ లేక మోటార్లు పనిచేయక నీటి సరఫరా నిలిచిపోయింది. ఉక్కపోత, దోమల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ ద్వారా సమాచారం ఇచ్చినప్పటికీ స్పందన ఆలస్యమైందని తెలిపారు. ఏఈ స్పందిస్తూ ఓవర్‌లోడ్ కారణంగా సమస్య తలెత్తిందని తెలిపారు. శనివారం ఉదయం లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న గ్రామస్తులు


శాలువాతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు చంద్రశేఖర్

## బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గోకల రమేష్

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో సాధారణ బదిలీల్లో భాగంగా నూతన ఎస్సైగా గోకల రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇచ్చోడ మండలంలో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన సంజయ్ కుమార్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రమేష్‌ను మండల బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు డి. చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గతంలో అతి తక్కువ కాలంలోనే విశేష సేవలు అందించి ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఎస్సైకి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్లంపల్లి 6వ వార్డులో తీవ్ర సమస్యలు

**- విద్యుత్ కోతలు, మంచినీటి ఇబ్బందులతో ప్రజలు ఆగ్రహం**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని ఆరవ వార్డులో నిత్యం విద్యుత్ కోతలు, మంచినీటి కొరత తీవ్రంగా మారి స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రజల నుంచి మంచినీటి బిల్లులు, విద్యుత్ బకాయిలను కఠినంగా వసూలు చేస్తున్నప్పటికీ, అదే స్థాయిలో సేవలు అందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నిత్యం కరెంట్ కోతలు విధించడం వల్ల తాగునీటి సరఫరా కూడా దెబ్బతింటోంది. ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్ పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని తెలిపారు. మున్సిపల్ మరియు విద్యుత్ శాఖ అధికారులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఆరవ వార్డులో నిరంతర విద్యుత్, మంచినీటి సరఫరాను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో బస్తీవాసులను సమీకరించి సంబంధిత అధికారుల కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి పూర్తి బాధ్యత అధికారులదేనని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబాల మహేందర్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

# నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి



ఆయిల్ పామ్ సాగు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

చింతలమానేపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:

మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ వెంకట్ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ ను సక్రమంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. ప్రమాదకరమైన పరాక్వాట్ రసాయన వినియోగంపై జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాలకు సంబంధించిన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కార్తీష, డీలర్లు పాల్గొన్నారు.

అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి గంగాపూర్ గ్రామాన్ని సందర్శించి ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. రామగోని అశోక్ గౌడ్ నిర్వహిస్తున్న తోటను చూసి, ఇంత మంచి నిర్వహణ జిల్లా మొత్తంలో ఎక్కడా చూడలేదని ప్రశంసించారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలని అధికారులు సూచించారు.



వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ ప్రధాన కార్యదర్శి బివి రమణ రావ్

## సబ్ కలెక్టర్ శ్రీ అజ్మీర సంకేత్ కుమార్‌కు వినతిపత్రం

### - సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు

### - తెలంగాణ ప్రధాన కార్యదర్శి బివి రమణ రావ్

భైంసా, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:

రాష్ట్ర శాఖ పిలుపుమేరకు భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగాత తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు మాట్లాడుతూ రెండో పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు రావాల్సిన సుమారు 13 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను రెండు విడతల్లో విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య కార్డులు వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే 2024 ఏప్రిల్ నుంచి రిటైర్ అయిన పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1, 2004 కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ భైంసా డివిజన్ సెక్రటరీ జనరల్ ఎస్. గంగాధర్, పీఆర్టీయూ ఎస్ రాష్ట్ర నాయకులు అన్సార్, గంగా మోహన్, శివరాం, మల్లికార్జున్, భైంసా డివిజన్ చైర్మన్ శ్రీహరి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు భూమన్న, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు నాగనాథ్, ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తోటల వేలంపాట రికార్డు స్థాయిలో ఆదాయం

ఉట్నూర్, ఏప్రిల్ 17,ప్రభాత వార్త:

ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీలలోని మామిడి, సపోటా పండ్ల తోటలకు జరిగిన బహిరంగ వేలంపాట లో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధర వచ్చింది అని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ ఒక ప్రకటనలో తెలిపారు...ఉట్నూర్ ఉద్యాన నర్సరీ లోని పండ్ల తోటను దుర్వ మహేష్ అనే వ్యక్తి (మూడు సంవత్సరాలకు ) 19 లక్షల రూపాయలకు జంబుగా నర్సరీ లోని పండ్ల తోటలను (మూడు సంవత్సరాలకు గాను) కడారి శ్రీనివాస్ అనే వ్యక్తి 8 లక్షల రూపాయలకు దక్కించుకున్నారు.అలాగే ఆసిఫాబాద్ తోటను రెండు లక్షల రూపాయలకు అమీర్ ఖాన్ అనే వ్యక్తి దక్కించుకోగా, బెల్లంపల్లి తోటను దుర్గం కాంతారావు అనే వ్యక్తి (మూడు సంవత్సరాలకు గాను) రూ. 7.60 లక్షలకు దక్కించికున్నట్లు ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.ఉట్నూర్, ఆసిఫాబాద్, గోదావరి ఖని, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, జైనూర్, కాగజ్ నగర్ మరియు ఆదిలాబాద్ ప్రాంతాల నుండి 23 మంది వ్యాపారస్తులు పాల్గొన్నారు.ఐటీడీఏ చరిత్ర లో ఇంత ఆదాయం బహిరంగ వేలం లో మొదటిసారి వచ్చింది.. అని, ఈ సంవత్సరం మంచి పంట వచ్చింది అని, దీని వెనక రెండు, మూడు సంవత్సరాలుగా ఐటీడీఏ ఉద్యాన విభాగ సిబ్బంది కృషి ఉన్నది అని స్పష్టం చేశారు. సరైన సమయం లో ఎరువులు, నీళ్లు అందించటం తో పాటు, అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ మేరకు తోటను దక్కించుకున్న వ్యక్తులకు ప్రాజెక్ట్ అధికారి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ వేలంపాట లో వేలంపాట కమిటీ సభ్యులు.. గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ, పరిపాలన అధికారి దామోదర్ స్వామి, ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి డి. నర్సయ్య, ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, ఉద్యాన విభాగ సిబ్బంది జయరాజు, అర్షిత, రాజేంద్ర ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## దరఖాస్తులు పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హాజీపూర్ మండలం వేంపల్లి, మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతాలలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలత, పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి త్వరగా అమలు చేయాలి

### - తిర్యాని తహశీల్దార్‌కు వినతిపత్రం

తిర్యాని, ఏప్రిల్ 17, ప్రభాతవార్త



ఉద్యోగ ఉపాధ్యాయులకు పి ఆర్ సి ని త్వరగా అమలు చేయాలని పి ఆర్ టి యూ టి ఎస్ తిర్యాని మండల అధ్యక్షులు జె శ్రీనివాస్ కోరారు. టిజిఈ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం తిర్యాని జడ్పి పాఠశాలలో, తహశీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలన్నారు. సిఆర్టీ లకు, సీఆర్పీ లకు ఎంటీఎస్ ను ప్రభుత్వం అమలు చేయాలన్నారు, ఐటీడీఏ పరిధిలో ఉన్న సిఆర్టీ లకు ఎంటీఎస్ అమలు చేయాలని, డీఏ లను, పెండింగ్ బిల్లులను త్వరగా ఇవ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల తహశీల్దార్ శ్రీనివాస్ కు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె, అంజయ్య, ఉపాద్యాయులు ,వివిధ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ ట్రాక్‌మెన్‌ల మాన్యువల్స్ మార్చాలి

### - పని భారానికి ముగింపు కావాలి

### - ఈనెల 22న చలో ఢిల్లీకి భారీగా తరలిరండి పిలుపు

బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

రైల్వే శాఖలో ట్రాక్‌మెన్‌లపై కొనసాగుతున్న అధిక పని గంటలు, పని భారాన్ని వెంటనే తగ్గించాలని, బ్రిటిష్ కాలం నాటి మాన్యువల్స్‌ను సవరించాలని ట్రాక్‌మెన్‌లు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో‘చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేసి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ చైర్మన్ ఎస్. నాగరాజు, సెక్రటరీ జి. సాంబశివుడు, ఇంజినీరింగ్ వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండనక, వాననక, అఘోరాత్రులు శ్రమిస్తున్న ట్రాక్‌మెన్‌లకు కేంద్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 22న ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే‘చలో ఢిల్లీ కార్యక్రమానికి బెల్లంపల్లి బ్రాంచ్ పరిధిలోని ట్రాక్‌మెన్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పనికి తగిన వేతనం, అధిక పని గంటల తగ్గింపు, పని భారానికి విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ట్రాక్‌మెన్‌లు నిరంతరం ఎక్కువసేపు పనిచేయడం వల్ల అనారోగ్య సమస్యలు పెరిగి అకాల మరణాలు సంభవిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి జీవనాడిగా చెప్పుకునే భారతీయ రైల్వే వ్యవస్థ వెనుక ట్రాక్‌మెన్‌ల శ్రమ ఎంతో ఉందని, కానీ వారి జీవితం మాత్రం ఇంకా పాత మాన్యువల్స్ మధ్యనే చిక్కుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుతం అమలులో ఉన్న వర్కింగ్ మాన్యువల్స్ బ్రిటిష్ పాలన కాలంలో రూపొందించబడినవని, అవి నేటి పరిస్థితులకు సరిపోవడం లేదన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పని విధానాల్లో మార్పులు చేయకపోతే ఈ వృత్తి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. పాత మాన్యువల్స్‌ను తక్షణం సవరించాలి, ట్రాక్ గస్తీ దూరాన్ని 12 కి.మీ నుంచి 8 కి.మీకి తగ్గించాలి, ఉదయం 6:30 నుంచి సాయంత్రం 5 వరకు ఉన్న పని గంటలను తగ్గించాలి, రెండు షిఫ్ట్‌ల విధానాన్ని అమలు చేయాలి, పెరిగిన పనిభారానికి అనుగుణంగా సిబ్బందిని పెంచాలి, పనికి తగిన వేతనం కల్పించాలి అని, ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ట్రాక్‌మెన్‌లు పాల్గొని తమ సమస్యలను, డిమాండ్లను వెల్లడించారు.






# బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రముఖ సంస్థ మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ విజయవంతంగా ముగిసింది. శుక్రవారం రోజున నిర్వహించిన ఈ నియామక కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ డ్రైవ్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో పాటు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆదిలాబాద్, సింగరేణి పాలిటెక్నిక్ మంచిర్యాల కళాశాలలకు చెందిన తుదివర్ష విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ (ఈఐఈ) శాఖలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో మేధా సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు సంస్థ కార్యకలాపాలు, రైల్వే ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, పవర్ సిస్టమ్స్ రంగాలలో ఉన్న విస్తృత ఉద్యోగ అవకాశాలపై వివరించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి, అధ్యాపకులు అతిథులను ఆహ్వానించి మాట్లాడారు. పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం ఎంతో అవసరమని, ఇలాంటి ప్లేస్మెంట్ కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు. తదుపరి ఎంపిక ప్రక్రియను మూడు దశల్లో నిర్వహించారు. ముందుగా రాత పరీక్ష, అనంతరం సాంకేతిక పరీక్ష, చివరగా వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. మొత్తం 85 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 13 మంది ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ నుండి 8 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆదిలాబాద్ నుండి 4 మంది, సింగరేణి పాలిటెక్నిక్ మంచిర్యాల నుండి 1 విద్యార్థి ఉన్నారు. వీరందరూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) శాఖకు చెందినవారే కావడం విశేషం. ఈ క్యాంపస్ డ్రైవ్ విద్యార్థులకు పరిశ్రమల పనితీరుపై అవగాహన కల్పించడమే కాకుండా, ఉద్యోగ అవకాశాల దిశగా ముందడుగు వేయడానికి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ సమర్థవంతంగా నిర్వహించగా, కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపకులు సక్రమంగా సమన్వయం చేసి విజయవంతం చేశారు.

# వేసవి దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

వడదెబ్బ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పరిశీలించి మరింత పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వంటశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు

**- మండల వ్యవసాయాధికారి రామకృష్ణ**

**- ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి జి. రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల స్టాక్ వివరాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వానాకాలం (ఖరీఫ్) సీజన్ ప్రారంభం దృష్ట్యా, ఎవరూ నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయించకూడదని డీలర్లకు స్పష్టంగా హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు లేదా గడ్డి మందులను రైతులకు అమ్మినట్లయితే, సంబంధిత డీలర్ల లైసెన్స్ రద్దు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు పుస్తకాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఎరువులు, పురుగు మందులు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్) యంత్రాల ద్వారా మాత్రమే అమ్మకాలు నిర్వహించాలని తెలిపారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.




# లేబర్ కోడ్‌లపై విప్లవ కార్మిక సంఘాల ఘాటు నిరసన

**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**




బెల్లంపల్లి శాంతిఖని గనిలో విప్లవ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా శుక్రవారం రోజున ఘాటైన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ చట్టాలు కార్మిక హక్కులను కుదించే కుట్రగా అభివర్ణిస్తూ వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు నాయకులు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను కలిపి రూపొందించిన ఈ కోడ్‌లు కార్మికులకు రక్షణ కల్పించేందుకు కాకుండా యాజమాన్యాలకు అధికారం పెంచేందుకు ఉపయోగపడుతున్నాయని విమర్శించారు. ఉద్యోగ భద్రతను దెబ్బతీసేలా 300 మంది ఉద్యోగులు ఉన్న సంస్థల్లో కూడా సులభంగా ఉద్యోగాల నుంచి తొలగించే నిబంధనలు తీసుకురావడం దారుణమని మండిపడ్డారు. ఇక కార్మికుల నిరసన హక్కును పరిమితం చేయడం, కాంట్రాక్ట్ మరియు గిగ్ వర్కర్లను నిర్లక్ష్యం చేయడం, కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి కీలక అంశాలను పక్కన పెట్టడం ఈ చట్టాల అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నాయని పేర్కొన్నారు. ఇవి సంక్షేమ పథకాలు కావు.. కార్మికులపై భారంగా మోపిన దోపిడీ విధానాలు అని తీవ్రంగా విమర్శించారు. 2026 ఫిబ్రవరి 13న దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెను గుర్తు చేస్తూ, కార్మికుల వ్యతిరేకతను పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జాతీయ కార్మిక సంఘాలు కూడా ఈ విషయంలో మౌనం వహించడం కార్మిక వర్గానికి ద్రోహమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం. పోచమల్లు, అంబాల మహేందర్, గోగర్ల శంకర్, జి. అంజయ్య, ఎన్నం శంకర్ తదితరులు పాల్గొని, కార్మికులు అప్రమత్తంగా ఉండి తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.